సాయంసంధ్య వేళ.. సరదాగా సేద తీరేలా..

ఆహ్లాదకర వాతావరణంలో పార్కులు

సాయంసంధ్య వేళ సరదాగా కాసేపు గడపాలని తలచే చిన్న, పెద్దలను నందనవనాలను తలపిస్తున్న పార్కులు స్వాగతిస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో నిర్వహణకు దూరంగా తుప్పల్లా ఉండే పార్కులు ఇప్పుడు చూడముచ్చటగా తయారయ్యాయి. రోజంతా అలసి వచ్చిన పెద్దలు కాసేపు సేద తీరేలా.. పుస్తకాల తో కుస్తీ పట్టిన పిల్లలు ఆటల్లో నిమగ్నమయ్యేలా పలకరిస్తున్నాయి. వారి ఆనందాన్ని, ఆటపాటలను చూస్తూ.. పెద్దలు కూడా ముచ్చటించుకునేలా బెంచీలు కొలువు దీరాయి. ఆరోగ్యాభిలాషుల కోసం వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు సిద్ధమయ్యాయి. వెరశి.. పార్కులు ఆనందానికి, ఆరోగ్యానికి, ఆహ్లాదానికి చిరునామాగా రూపుదిద్దుకోవడంతో నియోజక వర్గవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కూర్మన్నపాలెం: తిరుమల నగర్ చిల్డ్రన్స్ పార్కులో రూ.11 లక్షలతో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు



కూర్మన్నపాలెం: రూ.16 లక్షలతో అభివృద్ధి చేసిన భరత్‌నగర్ పార్కు


పెదగంట్యాడ: రూ.5 లక్షలతో 76వ వార్డు నడుపూరు గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్


కూర్మన్నపాలెం: భరత్‌నగర్ పార్కులో సేద తీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు


అక్కిరెడ్డిపాలెం: రూ.1 కోటి 48 లక్షలతో నిర్మించిన అక్కిరెడ్డిపాలెం లేక్ వ్యూ వాకింగ్ ట్రాక్


గాజువాక: చినగంట్యాడలోని అమరావతి పార్కులో నిర్మించిన వాకింగ్ ట్రాక్

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. వేద పండితులు రుద్రాభిషేకాలు చేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగి మాటూరి తిరుపతిరావు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, నడుపూరు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ధర్నాల కనకరెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల వేతనాల జాప్యంపై నిరసన


స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీతో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఈడీ వర్క్స్ (బిల్డింగ్) వద్ద ధర్నా చేశారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టించి పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేతనాలు చెల్లించలేని అసమర్థ యాజమాన్యం ప్రస్తుతం ప్లాంట్‌లో ఉందన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) సోబ్తీని కలిసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కొవిరి అవతారం, వేణువర్మ, రమణమూర్తి, నాయుడు, కొమ్ము ప్రసాద్, దేముడు, మంత్రి నారాయణ, గంగవరం గోపీ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు సాధించే వరకు పోరాటం

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్లను పూర్తిస్థాయిలో సాధించే వరకూ పోరాటం చేస్తామని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు పోర్టు యాజమాన్య ప్రతినిధులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ముందుగా ఎంప్లాయిస్ కమిటీ ప్రతినిధులతో యాజమాన్య ప్రతినిధులు చర్చించారు. కార్మికుల తరపున కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ రూ.36వేలు జీతం ఇవ్వాలని, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ యాజమాన్యంతో చర్చించిన అనంతరం చర్చలకు పిలుస్తామని చెప్పారు. దీంతో చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయి.

ఆటోనగర్, తోకాడ ప్రాంతాల్లో సీపీఎం ప్రచారం


ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

గాజువాక : ఇండియా కూటమి తరపున గాజువాక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు గాజువాక ఆటోనగర్, తోకాడ ప్రాంతాల్లో సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోకి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఆకట్టుకోవడానికి విద్యార్థులు ఫ్లాష్‌మాబ్‌లు నిర్వహించారు.

కేంద్రం దిగొచ్చేవరకు 'ఉక్కు' ఉద్యమం


పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణను అరెస్టు చేస్తున్న పోలీసులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం దిగొచ్చి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1179వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ చెందిన పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, సంస్థ కార్మికులు పాల్గొన్నారు.

పోరాట కమిటీ నాయకుల ముందస్తు అరెస్ట్

ప్రజాగళం సభకు హాజరయ్యేందుకు ప్రధాని నరేంద్రమోదీ అనకాపల్లి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. దువ్వాడ, గాజువాక పోలీసులు సోమవారం కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్దకు చేరుకుని పోరాటం చేస్తున్న ఆదినారాయణతో సహా ముగ్గురు నాయకులను అరెస్ట్ చేసి పెందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తున్నామనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 7న సాయంత్రం 5 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని గాజువాక నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు సీడబ్ల్యూసీలో వార్డు ఇన్‌చార్జి దొడ్డి రమణ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి, చిక్కా సత్యనారాయణ, కులుకూరి మంగరాజు, తాటికొండ జగదీష్, పరాంకుశం ప్రమీల, కాకినాడ పెంటారావు, అనపర్తి రమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

'ఉక్కు' యూనియన్ కార్యాలయంలో..

ఉక్కునగరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు సాపే బ్రహ్మయ్య కోరారు. ఉక్కునగరం యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి మంగళవారం గాజువాక బహిరంగ సభలో ప్రసంగించనున్నారన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్, వైఎస్సార్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ సానుభూతిపరులు సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో డి.సంపూర్ణం, డి.పుల్లారావు, నడిగంట్ల ఆనంద్, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మస్తానప్ప

అభివృద్ధిలో అగ్రభాగాన గాజువాక

- ఐదేళ్లలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

గాజువాక : గాజువాకను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడతానని వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని, ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు ఆధ్వర్యంలో చినగంట్యాడ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గాజువాక సమగ్రాభివృద్ధికి తాను ఇప్పటికే మేనిఫెస్టోను విడుదల చేశానని పేర్కొన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చి దిద్దుతానన్నారు. యువత ఉపాధికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. గాజువాకలో ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించడానికి శ్రీనగర్ జంక్షన్ నుంచి పాతగాజువాక జంక్షన్ వరకు ఫ్లైఓవర్‌ను నిర్మిస్తామన్నారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డి గాజువాకను గత ఐదేళ్లలో ఎంతో చక్కగా అభివృద్ధి చేశారని, తనకు అవకాశం కల్పిస్తే రానున్న ఐదేళ్లలో మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు. తన తండ్రి గురునాథరావు హయాంలో గాజువాక ప్రాంతంలోని ప్రతి గ్రామానికి కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారన్నారు. ఎన్నో అభివృద్ధి ఫలాలను అందించారన్నారు. ప్రభుత్వ సేవలను పొందడానికి విశాఖ సిటీకి పరుగులు తీయకుండా ఉండటం కోసం గాజువాకలోని ఒకే ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారన్నారు. ఆయన చేసిన అభివృద్ధి ఆదర్శంగా తాను కూడా ఇక్కడ అభివృద్ధిని సాధిస్తానన్నారు.


చినగంట్యాడ సభలో ప్రసంగిస్తున్న అమర్‌నాథ్

జగన్ పథకాలనే కాపీ కొట్టిన చంద్రబాబు

చంద్రబాబు చెబుతున్న ఎన్నికల హామీలను ఏ ఒక్కరూ నమ్మవద్దని కోరారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలనే కాపీ కొట్టి చంద్రబాబు గొప్పగా చెప్పుకొంటున్నారన్నారు. అంతకంటే మంచి పథకాలను జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నప్పుడు చంద్రబాబు చెప్పే మోసకారి పథకాలు ఎందుకని ప్రశ్నించారు. మోసం చేయడం ఆయన నైజమన్నారు. చంద్రబాబు నిరంతరం జగన్‌పై విమర్శలు చేయడం తప్ప ఆయన ఏం చేశారో చెప్పడంలేదన్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేకే ఇలాంటి విమర్శలు చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని ప్రకటించిన బీజేపీతో చంద్రబాబు జత కట్టారని, ఆయనకు ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్‌ను వదులుకోవాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, వారి కోసం ఎన్నో పథకాలను అమలు చేశారని అన్నారు. పథకాలను మరింత మెరుగ్గా అమలు చేయడం కోసం అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, జి.ఎ.రామమూర్తి, తమ్మిన నాయుడు, సిరసపల్లి శ్రీనివాస్, కొల్లి దేముడు, రెడ్డి జగన్నాథం, కె.మనోజ్ కుమార్, గొంతిన చిన అప్పారావు, తుంపాల రాజవరలక్ష్మి, సిరసపల్లి బాబూరావు, సిరసపల్లి వరహాలు, మిద్ది రమేష్, గోసల మోహన్ కృష్ణ, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం


వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా 86వ వార్డు ఫకీర్‌తక్యాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు తదితరులు - కూర్మన్నపాలెం


87వ వార్డు కణితి పద్మశాలి వీధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళకు కరపత్రం అందిస్తున్న వైస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు తదితరులు - కూర్మన్నపాలెం


ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో ప్రచారం చేస్తున్న సీనియర్ నాయకులు నమ్మి శ్రీనివాస్ ప్రసాద్, మాడిశ రాజు తదితరులు - కూర్మన్నపాలెం


69వ వార్డు తుంగ్లాం ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఈతలపాక మంగరాజు, అనపర్తి పెంటారావు, లాజరు వెంకట్రావు, పెట్ల అప్పారావు తదితరులు - అక్కిరెడ్డిపాలెం


గాజువాక ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరుతూ 65వ వార్డు భానోజీతోటలో మంత్రి మంజుల ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న నాయకుడు పిట్టా ప్రకాశ్‌రెడ్డి తదితరులు - పెదగంట్యాడ


జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా పార్టీ సీనియర్ నాయకుడు బలిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న నాయకులు - అగనంపూడి


దిబ్బపాలెం, దానబోయినపాలెం నిర్వాసిత కాలనీల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు యలమంచిలి అప్పారావు, బొట్ట గంగరాజు, శీరంశెట్టి గోవిందరావు - అగనంపూడి

చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రారంభం

ఉక్కునగరం: చేనేత, హస్త కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎస్. భాను అన్నారు. చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత, హస్తకళలు భారతదేశ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలన్నారు. అన్ని రకాల వస్తువులు ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఉక్కునగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సంఘం నిర్వాహకుడు హరీష్ మాట్లాడుతూ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్ అందుబాటులో ఉంచామన్నారు. జూన్ 18 వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, కళాక్షేత్రం కార్యదర్శి డొక్క నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


హస్తకళా ప్రదర్శన ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం భాను

ఎఫ్‌సీఐలో డిప్లమో కోర్సు ప్రారంభం

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ) లో డిప్లమో ఇన్ అసిస్టెంట్ కేటరింగ్ మేనేజ్‌మెంట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ఎఫ్‌సీఐలో కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కోర్సులో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల నుంచి 40 మంది చేరారు. కోర్సు 24 వారాలు కొనసాగుతుందని ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. కోర్సులో శిక్షణ పొందిన వారికి హాస్పిటాలిటీ నైపుణ్యం వస్తుందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక గ్రీన్ హోటల్ ఎదురుగా గల గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గాజువాక ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాలివి.. గాజువాక హిమాచల్ నగర్ గ్రీన్ హోటల్ వద్ద ఓ యాచకుడు భిక్షాటన చేస్తూ జీవిస్తుండేవాడన్నారు. ఆదివారం సాయంత్రం వరకు గ్రీన్ హోటల్ ఎదురుగా ఒక బండి పక్కన కనిపించిన అతడు సోమవారం గెడ్డలో విగతజీవుడిగా కనిపించాడని తెలిపారు. మృతుడి వయసు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, శరీరం బక్కచిక్కి గెడ్డంతో ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడండి

పీవోలు, ఏపీవోలతో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా ఉంటూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమష్టి కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఉత్తర, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల్లో విధుల్లో భాగస్వామ్యమయ్యే పీవోలు, ఏపీవోలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన రెండో విడత శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు సంబంధించిన ప్రక్రియపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఇంకా ఏమైనా సందేహాలుంటే రెండో విడత శిక్షణలో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారులు సమయపాలన పాటించాలని, పోలింగ్ రోజున ఓపికతో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎస్ఐసీ డీఐవో చంద్రశేఖర్, అసిస్టెంట్ డీఐవో పాషా, ఉత్తర, పెందుర్తి నియోజకవర్గాల ఆర్వోలు అఖిల, శేషశైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో పెందుర్తి ఆర్వో శేషశైలజ